శివపార్వతుల దీవెనలతో ప్రజలు సంతోషంగా ఉండాలి

● మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

అనంతగిరి, మే 14: శివపార్వతుల దీవెనలతో నియోజకవర్గ ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోదాడ మాజీ శాసనసభ్యుడు బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. మండలంలోని మొగలాయి కోట గ్రామంలో బుధవారం నిర్వహించిన పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో మల్లయ్యయాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఆలయాల నిర్మాణంతో ఆధ్యాత్మిక శోభ వెల్లి విరుస్తుందని, ప్రజల్లో ఐక్యత పెరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో మొగలాయికోట మాజీ సర్పంచ్ పొరల్ల ఉమాసత్యనారాయణ, బీఆర్ఎస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు కోండు వెంకటరత్నం, శింగారెడ్డి నారాయణరెడ్డి, ఎస్.అప్పిరెడ్డి, అల్లేబోయిన శివ, నూకల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలి

● ఎస్పీ నరసింహ

● 64 మంది కానిస్టేబుళ్లకు బదిలీ ఉత్తర్వులు జారీ

మాట్లాడుతున్న ఎస్పీ నరసింహ

సూర్యాపేట టౌన్, మే 14: పోలీస్ యూనిఫామ్‌కు సమాజంలో ఒక మంచి గుర్తింపు ఉందని, ప్రజలకు ఉత్తమ సేవలు అందించేందుకు పోలీస్ సిబ్బంది కృషి చేయాలని ఎస్పీ నరసింహ అన్నారు. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో పని చేస్తూ ఐదేండ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న 64 మంది కానిస్టేబుళ్లకు బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో కౌన్సిలింగ్ నిర్వహించి కోరిన చోటుకు బదిలీ చేసి ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సమాజ రక్షణ పోలీసుల ప్రధాన విధి అని గుర్తు చేశారు. సూర్యాపేట జిల్లా పోలీసులు కష్టపడి పని చేస్తారనే పేరుందని, అందుకు తగ్గట్టుగా కష్టపడి పని చేస్తూ ఆ పేరును కాపాడుకోవాలని తెలిపారు. స్టేషన్ల పరిధిలో జరిగే అసాంఘిక కార్యకలాపాలను గుర్తించి నిరోధించడంలో కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ నాగేశ్వర్‌రావు, అడ్మినిస్ట్రేషన్ అధికారి మంజుభార్గవి, ఏఆర్ డీఎస్పీ నరసింహాచారి, స్పెషల్ బ్రాంచి ఇన్‌స్పెక్టర్ నాగభూషణరావు, పోలీసు సంఘం అధ్యక్షుడు రామచందర్, ఆర్ఎస్ఐ మహేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

అమర జవాన్లకు నివాళి

కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న యువత

పాలకవీడు, మే 14: ఆపరేషన్ సిందూర్‌లో ప్రాణాలు కోల్పోయిన అమర జవాన్లకు మండల యూత్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి పాలకవీడులో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ యువజన నాయకుడు సతీశ్ మాట్లాడుతూ అమర జవాన్ల త్యాగాలు మరువలేనివని అన్నారు. యువత వారిని స్ఫూర్తిగా తీసుకొని దేశ రక్షణకు పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో పలు గ్రామాల యువకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు సహకరించాలి

● కోదాడ ట్రాఫిక్ ఎస్ఐ మల్లేశ్

ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ మల్లేశ్

కోదాడ టౌన్, మే 14: రోడ్డు ప్రమాదాల నియంత్రణకు వాహనదారులు సహకరించాలని కోదాడ ట్రాఫిక్ ఎస్ఐ మల్లేశ్ అన్నారు. కోదాడ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ సమీపంలో ఆటోడ్రైవర్లకు, ఇతర వాహనదారులకు బుధవారం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ మాట్లాడుతూ వాహనాల రద్దీ రోజురోజుకూ పెరుగుతున్నందున ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా వాహనదారులు నిబంధనలు పాటించాలని తెలిపారు. రాంగ్ రూట్ ప్రయాణాలు ప్రమాదకరమని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే జరిమానాలు తప్పవని హెచ్చరించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని, మైనర్లకు వాహనాలు ఇస్తే కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. బైకులకు సైలెన్సర్లు తీసేసి నడిపితే చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేకాడుతున్న ముగ్గురి అరెస్ట్

కోదాడ రూరల్, మే 14: మండల పరిధిలోని కూచిపూడి తండా శివారులో పేకాట ఆడుతున్న ముగ్గురిని పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. తండాకు చెందిన గుగులోతు శ్రీను, బి.నాగరాజు, బడావత్ సైదులు పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు రూరల్ పోలీసులు దాడులు జరిపి అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.2,900 నగదు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం.అనిల్‌రెడ్డి తెలిపారు.

'సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి'

హుజూర్‌నగర్ రూరల్: పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను, నాయకులు

హుజూర్‌నగర్ రూరల్, మే 14: దేశవ్యాప్తంగా ఈ నెల 20న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని రైస్ మిల్ డ్రైవర్లతో సమావేశం నిర్వహించి సమ్మె కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సాగిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సమ్మె చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్రీను, వెంకటమ్మ, గోపమ్మ, సైదమ్మ, పద్మ, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

మద్దిరాల: జాతీయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 20న నిర్వహించే సార్వత్రిక సమ్మెలో కార్మికవర్గం పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని తెలంగాణ భవన, ఇతర నిర్మాణ కార్మిక యూనియన్ (ఐఎఫ్‌టీయూ) జిల్లా ఉపాధ్యక్షుడు నాగెల్లి రాంనర్సయ్య కోరారు. మండల కేంద్రంలో నాయకులతో కలిసి సమ్మె పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ మండలాధ్యక్షుడు మరికంటి ఉపేందర్, బర్పటి శ్రీను, మాతంగి ఉప్పలయ్య, వెంకన్న, యాదగిరి పాల్గొన్నారు.

కోదాడ రూరల్: ఈ నెల 20న దేశవ్యాప్తంగా నిర్వహించే సమ్మెలో అన్ని విభాగాల కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని సిమెంట్ పరిశ్రమల వర్కర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ వట్టెపు సైదులు అన్నారు. బుధవారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎం. ముత్యాలు, రవీందర్‌రెడ్డి, పి.కృష్ణ, శ్రీను, వీరేందర్, శ్రీరామ్, ఏసు, రవీందర్, అనిల్, రామయ్య పాల్గొన్నారు.

మిల్లర్లు ధాన్యాన్ని ఎప్పటికప్పుడు దిగుమతి చేసుకోవాలి

● కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

రైస్ మిల్లులో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

తిరుమలగిరి, మే 14: కొనుగోలు కేంద్రాల నుంచి తరలించిన ధాన్యం బస్తాలను మిల్లర్లు ఎప్పటికప్పుడు దిగుమతి చేసుకోవాలని, అవసరం అయితే హమాలీల సంఖ్యను పెంచుకోవాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సూచించారు. మండల కేంద్రంలోని ఏఎస్ఆర్ రైస్ మిల్లును కలెక్టర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూసుకోవాలని తెలిపారు. అనంతరం తొండ గ్రామంలో పర్యటించి కొనుగోలు కేంద్రంలో రిజిస్టర్లను తనిఖీ చేశారు. గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించి పంచాయతీ అధికారులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. అదే విధంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల యూనిఫాం కుట్టు కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం కోక్యానాయక్ తండా పంచాయతీలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించి, ప్రభుత్వం సూచించిన కొలతల ప్రకారం ఇండ్ల నిర్మాణాలు చేపట్టాలని తెలిపారు. ఇండ్ల నిర్మాణానికి సకాలంలో ఇసుక అందుతుందా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని నర్సరీ, సెగ్రిగేషన్ షెడ్‌ను పరిశీలించారు. అనంతరం తిరుమలగిరి మున్సిపాలిటీ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పాల్గొని శానిటేషన్, టౌన్‌ప్లానింగ్, ఇంజినీరింగ్ విభాగాల పనితీరుపై సమీక్షించారు. ఆయా కార్యక్రమాల్లో సివిల్ సప్లై మేనేజర్ ప్రసాద్, తాసీల్దార్ హరి ప్రసాద్, ఎంపీడీఓ లాజర్, ఏఓ నాగేశ్వర్‌రావు, ఏపీఎం మధుసూదన్, మున్సిపల్ కమిషనర్ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

'ప్రజల రక్షణ కోసమే పోలీసులు'

ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ట్రెయినీ ఎస్ఐ సురేశ్‌రెడ్డి

గరిడేపల్లి, మే 14: ప్రజల రక్షణ కోసమే పోలీస్ యంత్రాంగం పని చేస్తుందని ట్రెయినీ ఎస్ఐ సురేశ్‌రెడ్డి అన్నారు. సైబర్ నేరాలపై గరిడేపల్లి పోలీస్ స్టేషన్‌లో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు, యువత సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల జోలికి వెళ్లొద్దని తెలిపారు. మూఢ నమ్మకాలు, రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీనర్సయ్య, వెంకటేశ్వర్లు, ప్రశాంత్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అంబేద్కర్ భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలి

● తాసీల్దార్‌కు బీఆర్ఎస్ నాయకుల వినతి

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తుంగతుర్తి, మే 14: తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కోటి రూపాయల వ్యయంతో నిర్మించిన డాక్టర్ బీఆర్.అంబేద్కర్ భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు తాసీల్దార్ దయానందంకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలు శుభకార్యాలు, సభలు, సమావేశాలు నిర్వహించుకోవడానికి ఉపయోగకరంగా ఉంటుందని కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అంబేద్కర్ భవనాన్ని నిర్మించారని తెలిపారు. ప్రస్తుత తుంగతుర్తి ఎమ్మెల్యే సామేలు గెలిచిన నెల రోజులకే ఆయన పేరుతో శిలాఫలకం పెట్టుకొని ఆ భవనాన్ని ప్రారంభించి గాలికి వదిలేశారని ఆరోపించారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి భవనానికి విద్యుత్ సౌకర్యం, నీటి సదుపాయం, ప్రహరీ నిర్మించి వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తడకమళ్ల రవికుమార్, మల్లేశ్, బొజ్జ సాయికిరణ్, బొంకూరి మధు, తడకమళ్ల మల్లికార్జున్, బోయిన కొమరయ్య, పోతరాజు మహేశ్, ఏపూరి మహేశ్, కొండగడుపుల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

16న మాజీ సర్పంచ్ దేగల మధుసూదన్ వర్ధంతి

ఆత్మకూర్.ఎస్, మే 14: ఆత్మకూర్.ఎస్ గ్రామ మాజీ సర్పంచ్, తెలంగాణ పోరాట యోధుడు దేగల మధుసూదన్ 35వ వర్ధంతి సభ ఈ నెల 16న మండల కేంద్రం ఆత్మకూర్.ఎస్‌లో జరుపనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆత్మకూర్.ఎస్‌లోని అమరవీరుల స్థూపం వద్ద వర్ధంతి సభ కరపత్రం ఆవిష్కరించి మాట్లాడారు. సభను మండల కేంద్రంలోని పూర్వ విద్యార్థుల సంఘం భవనంలో సాయంత్రం 5 గంటలకు నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రజలు సభలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో దేగల జనార్దన్, అబ్బగాని భిక్షం, దేగల వెంకటకృష్ణ, పోరండ్ల దశరథ, గునగంటి శ్రీనివాస్, గుద్దేటి లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జనార్దన్ వర్ధంతి సభను జయప్రదం చేయాలి

● సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి డేవిడ్‌కుమార్

సూర్యాపేట టౌన్, మే 14: సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ సభ్యుడు దివంగత జలగం జనార్దన్ 4వ వర్ధంతి సభలు ఈ నెల 21 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.డేవిడ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం జిల్లా కేంద్రంలోని చంద్ర పుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో వర్ధంతి సభల కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. మే 20న జాజిరెడ్డిగూడెం, 21న ఏపూరు, వెలిదండ, 22న డి.కొత్తపల్లి, 23న చిల్పకుంట్ల, 24న రాయిపాడు, 25న సూర్యాపేటలో వర్ధంతి సభలు జరుపనున్నట్లు చెప్పారు. పార్టీ శ్రేణులు, ప్రజా సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఇఫ్టూ జిల్లా కార్యదర్శి గంట నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

'సమ్మెకు సీపీఐ మద్దతు'

పాలకవీడు, మే 14: దేశవ్యాప్తంగా ఈ నెల 20న జరుగనున్న కార్మిక సంఘాల సమ్మెకు సీపీఐ సంపూర్ణ మద్దతు ఇస్తుందని ఆ పార్టీ జిల్లా నాయకుడు ధనుంజయనాయుడు వెల్లడించారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను కాలరాస్తుందని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ కార్మికులను బానిసలుగా మార్చే చట్టాలను అమలు చేయాలని యత్నిస్తుందని, కేంద్రం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలంతా ఏకమై సమ్మెను విజయవంతం చేయాలని కోరారు.

బియ్యం వితరణ

నూతనకల్, మే 14: మండల పరిధిలోని యడవెల్లి గ్రామానికి చెందిన పిట్టల సూర్యకుమార్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. సూర్యకుమార్ కుటుంబానికి మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గాజుల తిరుమలరావు, బీఆర్ఎస్ నాయకులు బుధవారం క్వింటా బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా తిరుమలరావు మాట్లాడుతూ తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ ఆదేశానుసారం నిరుపేద కుటుంబాలకు సాయం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొచ్చెర్ల బాబు, నాయకులు తూముల వెంకటేశ్వరరావు, సంద జ్యోతి, సోము భిక్షం, బయ్య సోమల్లు, కట్ట దేవేందర్, లింగయ్య, సుదర్శన్, మల్లయ్య, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో చోరీ

గరిడేపల్లి, మే 14: మండల పరిధి అప్పన్నపేట గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో చోరీ జరిగిన విషయం బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆలయంలోని హుండీ తాళం పగులగొట్టిన దుండగులు హుండీలోని డబ్బులతో పాటు స్వామి వారి 15 తులాల వెండి కిరీటాన్ని దొంగిలించినట్లు గ్రామస్తులు తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

హుజూర్‌నగర్, మే14: ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) పేదలకు వరమని కాంగ్రెస్ పార్టీ హుజూర్‌నగర్ పట్టణాధ్యక్షుడు తన్నీరు మల్లికార్జున్ అన్నారు. పట్టణంలోని 5వ వార్డుకు చెందిన దాసరి యాదగిరి అనే వ్యక్తికి మంజూరైన రూ.60 వేల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కును బుధవారం ఆయన అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యుడు నాగేశ్వర్‌రావు, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

వరి కొయ్యలను కాల్చొద్దు.. కలియదున్నాలి

● కాలిస్తే నేలకు, పర్యావరణానికి హాని

● పంటల దిగుబడిపై ప్రభావం

దాచారంలో వరి కొయ్యలకు నిప్పు పెట్టిన దృశ్యం

నేరేడుచర్ల, మే 14: యాసంగి వరి కోతలు పూర్తయ్యాయి. గతంలో వరి పంటను కొడవళ్లతో మొదళ్ల దాకా కోసేవారు. అంతేకాకుండా పశువులు ఎక్కువగా ఉండడంతో గడ్డిని కుప్పలుకుప్పలుగా పశుగ్రాసం కోసం నిల్వ చేసేవారు. అయితే, ప్రస్తుతం సాగు విధానంలో అనేక మార్పులొచ్చాయి. వరి కోత సమయంలో యంత్రాలను వినియోగిస్తున్నారు. మిషన్‌తో కోత కోసే సమయంలో పైకి కోయడం ద్వారా కొయ్యలు పెద్దగా మిగిలిపోతున్నాయి. అవసరమున్న రైతులు కొంత గడ్డిని తీసుకెళ్లి మిగిలిన దానిని పొలాల్లోనే వదిలేస్తున్నారు. దీంతో దున్నే సమయంలో నాగళ్లకు అడ్డుగా వస్తున్నాయని రైతులు వరి కొయ్యలతో పాటు గడ్డిని కూడా కాలబెట్టే ప్రయత్నం చేస్తున్నారు. దీని వల్ల అధిక నష్టాలు వచ్చే అవకాశం ఉందని, ఎట్టి పరిస్థితిల్లోనూ వరికొయ్యలను తగులబెట్టొద్దని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. కొయ్యలు తగులబెడితే వెలువడే పొగతో వాతావరణ కాలుష్యంతో పాటు భూసారం దెబ్బతింటుంది. సూక్ష్మపోషకాలు నశిస్తాయి. పంట దిగుబడిపై ప్రభావం చూపుతుంది. భవిష్యత్తులో సేద్యం కష్టమవుతుంది. ఈ విపత్తును తప్పించడానికి రైతులంతా కొయ్యలను కలియదున్ని సేంద్రియ ఎరువుగా మార్చుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. కలియదున్నాలంటే చాలా సమయం పడుతుందని, ఖర్చుతో కూడుకుందని భావిస్తున్నారు. ఒక్కసారి మంట అంటిస్తే గంటలో కాలిపోతుందనే ఆలోచనలో ఉన్నారు. ఈ నేపథ్యంలో రైతులకు వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు. అయినా కొందరు రైతుల తీరు మారడం లేదు.

కలియదున్నితే ఉపయోగాలు

- కలియ దున్నడంతో వరికొయ్యలు మట్టిలో కలిసిపోయి సేంద్రియ ఎరువుగా మారుతుంది.
- నత్రజని, భాస్వరం, సూక్ష్మ పోషకాలు వృద్ధి చెందుతాయి.
- సేంద్రియ కర్బన్ శాతం పెరుగుతుంది.
- భూసారం పెరిగితే వ్యవసాయానికి వాడే ఎరువులను 30 నుంచి 40 శాతం తగ్గించుకోవచ్చు.
- వానపాములు పెరిగి భూమి సారవంతమవుతుంది.

ఇలా చేయాలి

- పొలాన్ని రోటవేటర్‌తో కలియదున్నితే వరి కొయ్యలు చిన్నచిన్న ముక్కలుగా మారుతాయి.
- దుక్కికి నీళ్లు పెట్టి ఎకరాకు 100 గ్రాముల సింగిల్ సూపర్ పాస్ఫేట్ వేసి 15 నుంచి 20 రోజులు పొలాన్ని నానబెట్టాలి. తద్వారా కొయ్యలు పూర్తిగా కుళ్లిపోయి సేంద్రియ ఎరువుగా మారుతుంది.

తగులబెడితే నష్టాలు

- వరి కొయ్యలను కాలిస్తే భూసారం దెబ్బతింటుంది. తేమను కలిగి ఉండే మట్టి తన సహజగుణాన్ని కోల్పోతుంది.
- నేలలో సహజసిద్ధంగా ఉండే సూక్ష్మజీవులు, మిత్ర పురుగులు నశిస్తాయి.
- నత్రజని వంటి పోషక పదార్థాలు క్షీణిస్తాయి.
- కొన్నేళ్లు భూసారమంతా తగ్గిపోవడంతో సాగుకు పనికి రాకుండా పోతుంది.
- కాల్చడంతో వచ్చే దట్టమైన పొగతో రైతుల ఆరోగ్యం దెబ్బతింటుంది.
- మంటలు పెద్దవైతే పక్కనే ఉండే ఇతర పంటలు, బోర్ల పైపులు, స్టార్టర్లు తదితర వస్తువులు కాలిపోతాయి.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

నూతనకల్, మే 14: కల్యాణలక్ష్మి పథకం ఆడపడుచులకు అండగా నిలుస్తోందని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మండల కేంద్రంలోని తాసీల్దార్ కార్యాలయంలో బుధవారం 20 మంది లబ్ధిదారులకు ఆయన కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. పేదింటి మహిళలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తాసీల్దార్ శ్రీనివాస్‌రావు, ఎంపీడీఓ సునీత, రాష్ట్ర రైతు కమిషన్ సభ్యుడు చెవిటి వెంకన్న, తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నాగం జయసుధసుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

● అదనపు కలెక్టర్ రాంబాబు

మద్దిరాలలోని కొనుగోలు కేంద్రంలో కాంటాల వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ రాంబాబు

మద్దిరాల, మే 14: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. మద్దిరాల, పోలుమల్ల గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంటాలలో తేడాలు లేకుండా త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని నిర్వాహకులకు సూచించారు. అధికారుల సూచనలు పాటిస్తూ ధాన్యం కొనుగోలు చేస్తే దిగుమతి సమయంలో ఎలాంటి కోతలు ఉండవని తెలిపారు. మిల్లుల్లో ధాన్యం త్వరగా దిగుమతి చేసుకునేలా మిల్లర్లను సమన్వయం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తాసీల్దార్ అమీన్‌సింగ్, కొనుగోలు కేంద్రం నిర్వాహకులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాల్లో తప్పులు ఉంటే తెలియజేయాలి

● తాసీల్దార్ నాగార్జునరెడ్డి

సమావేశంలో పాల్గొన్న నాయకులు

హుజూర్‌నగర్, మే 14: ఓటర్ల జాబితాల్లో తప్పులు ఉంటే తెలియజేయాలని తాసీల్దార్ నాగార్జునరెడ్డి అన్నారు. తాసీల్దార్ కార్యాలయంలో బుధవారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఎన్నికల కమిషన్ నూతనంగా తీసుకొచ్చిన నిబంధనలను నాయకులకు వివరించారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు మల్లికార్జున్, రాంబాబు, గుండు వెంకటేశ్వర్లు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

క్షయ బాధితులకు పోషకాహార కిట్లు అందజేత

పోషకాహార కిట్లను అందజేస్తున్న మండల వైద్యాధికారి లింగమూర్తి

తుంగతుర్తి, మే 14: తెలంగాణ ప్రభుత్వం అందజేస్తున్న పోషకాహార కిట్లను క్షయ వ్యాధి బాధితులు సద్వినియోగం చేసుకోవాలని మండల వైద్యాధికారి లింగమూర్తి అన్నారు. తుంగతుర్తి మండలంలోని పలు గ్రామాలకు చెందిన క్షయ వ్యాధి బాధితులకు బుధవారం పోషకాహార కిట్లను అందజేసి మాట్లాడారు. ప్రతి పోషకాహార కిట్టులో 3 కిలోల గోధుమపిండి, 1.50 కిలోల కందిపప్పు, 250 మిల్లీలీటర్ల నూనె, ఒక కేజీ పల్లీలు ఉంటాయని వివరించారు. పౌష్టికాహారం తీసుకుంటే క్షయ బాధితులు త్వరగా కోలుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'సీపీఐ మండల మహాసభను జయప్రదం చేయాలి'

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

గరిడేపల్లి, మే 14: మండలంలోని గానుగబండ గ్రామంలో ఈ నెల 17వ తేదీన నిర్వహించనున్న సీపీఐ గరిడేపల్లి మండల 15వ మహాసభను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు పార్టీ శ్రేణులను కోరారు. ఈ మేరకు బుధవారం గానుగబండ గ్రామంలో మహాసభ కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యవర్గ సభ్యులు కడియాల అప్పయ్య, కుందూరు వెంకటరెడ్డి, ఈద సైదులు, అంబటి వెంకటరెడ్డి, గోవిందరెడ్డి, పాలేటి సైదులు, పోకల ఆంజనేయులు, షేక్ హిమామ్‌బీ, నరసింహారావు, పంగ సైదులు, నిమ్మల వెంకటేశం, షేక్ ఖాసీంసాహెబ్, చిన్ని తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

● సీఐ చరమందరాజు

రాయినిగూడెంలో ప్రజా భరోసా కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ చరమందరాజు

గరిడేపల్లి, మే 14: సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ చరమందరాజు అన్నారు. మండలంలోని రాయినిగూడెం గ్రామంలో బుధవారం నిర్వహించిన పోలీస్ ప్రజా భరోసా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అత్యాశతో ఆన్‌లైన్ బెట్టింగులకు పాల్పడొద్దని, సైబర్ మోసగాళ్ల బారినపడి ఆర్థికంగా నష్టపోవద్దని సూచించారు. ప్రజల రక్షణ కోసమే పోలీసులు పని చేస్తున్నారని తెలిపారు. ఎవరైనా తప్పు చేసినా, తప్పును ప్రోత్సహించినా, తప్పుడు సలహాలు ఇచ్చినా, తప్పును దాచిపెట్టినా చట్ట ప్రకారం అది నేరమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ చట్టానికి లోబడి నడుచుకోవాలని, ఉల్లంఘనకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ చలికంటి నరేశ్, ట్రెయినీ ఎస్ఐ సురేశ్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

'సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలి'

మేళ్లచెరువు, మే 14: ఈ నెల 20న జరుగనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి వట్టెపు సైదులు పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, పనికి తగిన వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తూ చేపట్టనున్న ఈ సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో అశోక్, రాములు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.